

ఏడాది చివరన టిడ్కో గృహప్రవేశాలు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

గత టిడిపిలో హయంలో 80-90 శాతం పూర్తిఅయిన టిడ్కోగృహాల్లో మిగిలిన నిర్మాణాన్ని పూర్తిచేసి ఈ ఏడాది చివరి లోగా గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. శనివారం టిడ్కో గృహాలను పరిశీలించి అక్కడ రూ.2 కోట్లతో నిర్మాణం అవుతున్న బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత టిడిపి హయాంలో 90 శాతం వరకు నిర్మాణం పూర్తయిన వైసిపి 5 సంవత్సరాల పాలనలో మిగిలిన పని పూర్తి చేయలేదని తిరిగి తాము అధికారం చేపట్టాక మిగిలిన 10 శాతం నిర్మాణం పూర్తి చేస్తున్నామన్నారు. అధికారులను రప్పించి ప్రతివారం సమీక్ష చేసి మొత్తం అందరికీ గృహప్రవేశం చేసేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి చెప్పారు.



కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి చేరిన వరద నీరు



గొమ్ముగూడెంలో ట్రాక్టర్లలో సామగ్రి వేసుకుని పునరావాస కాలనీకి వెళ్తున్న బాధితులు

కొనసాగుతున్న గోదావరి వరద

గొమ్ముగూడెంలోని 100 కుటుంబాలను రావికుంట పునరావాస కేంద్రానికి తరలింపు

స్పిల్ వే నుంచి 7,43,222 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ఆందోళనలో ముంపు, లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరికి వరద ఉధృతి శనివారం కొనసాగుతూనే ఉంది. వరద పెరగడంతో ఇప్పటికే దాచారం, కుక్కునూరు మధ్య గుండేటి వాగు కాజ్‌వేపైకి వరద నీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించాయి. గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండడంతో వరద ప్రభావిత గ్రామాలైన గొమ్ముగూడెంలోని 253 కుటుంబాలకు గాను 100 కుటుంబాలు రావికుంట పునరావాస కేంద్రానికి తరలివెళ్లారు. అధికారులు లచ్చిగూడెం గ్రామస్తులను సురక్షిత కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలంలో 41.3 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరుకుంది. దీంతో ముంపు మండలాల ప్రజలు, రైతుల్లో తీవ్ర అలజడి నెలకొంది. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో గోదావరి ఉండడంతో వరద మరింత పెరిగితే ముత్యాలంపాడు వింజరం, వేలేరు, సీతారామ నగరం మధ్య రహదారులపైకి వరద నీరు చేరితే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచే ప్రమాదం ఉంది. గోదావరి పెరుగుతుండడంతో అధికారులు లోతట్టు గ్రామాల వరద బాధితులు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని, వరద బాధితులకు అవసరమైన బియ్యం, నిత్యావసరాలు, టార్పాలిన్లు, తాగునీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామని అధికారులు గ్రామాల్లో టామ్ టామ్ వేయించి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

బాధితులకు వసతి సౌకర్యాలు

మండలం గొమ్ముగూడెం గ్రామంలోని దాచారంలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాన్ని శనివారం జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి పర్యవేక్షించారు. వరద బాధితులను తరలించి, ప్రజలకు భోజన వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. భోజనానికి సంబంధించి నిత్యావసర సరుకులు, వంట సామగ్రిని శిబిరానికి తరలించి శిబిరంలో ప్రజలకు భోజనం అందిస్తున్నారు. తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారు. టాయిలెట్లు, శిబిరం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది దాచారం వరద శిబిరంలో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారు. అన్ని గ్రామాల్లో వరద ప్రమాద హెచ్చరికపై టాంటాం చేస్తూ, మండలంలోని ప్రజలు గోదావరి నదిలోకి చేపల వేటకు వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. జిల్లా సర్వే అధికారి అన్సారీ, తహశీల్దార్ కె.రమేష్‌కుమార్, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరద పెరిగింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారానికి భద్రాచలం వద్ద నీటి మట్టం 41.03 చేరింది. అయితే ప్రస్తుతం నిలకడగా ఉంది. నీటిమట్టం 45 అడుగులకు చేరితే దారిలేక సామాన్లు తరలింపునకు ఇబ్బంది పడతామని, రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూర్‌గొమ్ము గ్రామాల్లోని సుమారు 50 కుటుంబాలు ముందు జాగ్రత్తగా తమ సామగ్రితో భూదేవిపేట, అశ్వారావుపేట, ఆసుపాక, నెమలిపేట ఆర్అండ్ఆర్ కాలనీలకు వెళ్లిపోతున్నారు.



కోడేరు వద్ద పెరుగుతున్న వశిష్ట గోదావరి

రహదారి సౌకర్యం లేని 18 గ్రామాలు..

వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో యడవల్లి వద్ద న్న కాజ్‌వే మునిగిపోవడంతో రహదారి సౌకర్యం లేక కట్కూరు, కోయిదా, టేకూరు, సిద్ధారం, కాకిసునూరు, ఎడవల్లి తదితర 18 గ్రామాల ప్రజలకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు తమ తమ అవసరాల కోసం మండల కేంద్రాన్ని చేరుకోవాలంటే ఆ కాజ్ వే మీద నుంచి ప్రయాణం చేయాలి. కాజ్‌వే మునిగిపోవడంతో పడవ దాటి వేలేరుపాడు చేరుకోవాలని పరిస్థితి ఏర్పడింది. అధికారులు, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పునరావాస శిబిరాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి : ఆర్‌డిఒ

మండలంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. సహాయ పునరావాస కార్యక్రమాలను జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయరాజు శనివారం దగ్గరుండి పర్యవేక్షించారు. ముందుగా వరద ప్రభావానికి గురైన రేపాకగొమ్ము గ్రామస్తులను తాడువాయిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వరద సహాయ పునరావాస శిబిరానికి తరలించారు. అనంతరం వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ రమణ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పునరావాస కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. వరద పునరావాస శిబిరాల్లో ప్రజలకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. టార్పాలిన్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పునరావాస కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదన్నారు. పునరావాస కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు, వైద్య శిబిరంలో సేవలను ఆర్‌డిఒ రమణ, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయరాజు పరిశీలించారు. తహశీల్దార్ జి.సత్యనారాయణ, రెవెన్యూ, పౌర సరఫరాలు, పంచాయతీ రాజ్, పోలీసు, ఆర్‌డబ్ల్యుఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటి మట్టం శనివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 7,43,222 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 31.430 మీటర్లు, దిగువన 22.600 మీటర్లు, ఎగువు కాపర్ డ్యాం ఎగువన 31.900 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 22,050 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాం మధ్య 16.080 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు దిగువన 10.78 మీటర్లు నమోదైందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండిపోశమ్మ ఆలయం నీటమునగడంతో ఆలయానికి రాక పోకలను అధికారులు నిలిపివేశారు.

లంకగ్రామాల ప్రజల ఆందోళన

ఆచంట : వశిష్ట గోదావరి క్రమం క్రమంగా పెరుగుతోంది. దీంతో లంక గ్రామాల ప్రజలు, రైతుల్లో ఆందోళన చెందుతున్నారు. సర్దార్ కాటన్ బ్యారేజ్ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు దిగువకు విడుదల చేస్తుండడంతో వశిష్ట గోదావరి శనివారం సాయంత్రానికి మూడు అడుగుల మేర పెరిగింది. దీంతో అధికారులు మరింత ప్రమత్తమయ్యారు. వరద నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నెమ్మది నెమ్మదిగా పల్లపులంక ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. భీమలాపురం ఏటిగట్టున దిగువ ఉన్న నివాస ప్రాంతల వారిని వరద ఈ క్షణంలోనైనా చుట్టుముట్టే ప్రమాదం ఉండడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

కనకాయలంకలో ఆర్‌డిఒ పర్యటన

యలమంచిలి : వశిష్ట గోదావరికి వరదల నేపథ్యంలో లోతట్టు, లంక గ్రామ ప్రజలను అప్రమత్తం చేసేందుకు శనివారం నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కనకాయలంక పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గోదావరి నీటి మట్టం భద్రాచలం వద్ద ఎనిమిది లక్షల క్యూసెక్కులు ఉందని, ఆదివారం నాటికి 10 లక్షల క్యూసెక్కులు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు, లంక గ్రామాల ప్రజలు ఉండాలని సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్, కూటమి నాయకులు ముస్కుడి శ్యాంబాబు, నిమ్మల శ్రీనివాస్ పులి శ్రీరామ్ మూర్తి ఉన్నారు.

ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

విద్య, వైద్య రంగాన్ని ప్రయివేటీకరణ చేయాలని, పాలకుల విధానాలను తిప్పి కొట్టాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆశా వర్కర్ల జిల్లా సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు చింతపల్లి లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గిన్నిస్ బుక్ రికార్డు పేరుతో విద్య, వైద్య రంగాన్ని ప్రభుత్వ రంగం నుంచి దూరం చేసే ప్రయత్నంలో భాగమే యోగ, తల్లిదండ్రుల సమావేశాలు అని విమర్శించారు. తల్లికి వందనం పేరుతో ప్రయివేటు విద్యా సంస్థలను ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలకు నష్టం చేసే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యమాలకు సిద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ విద్యారంగం నాశనం అయితే కొనుక్కునేవాడికే విద్య అందుతుందని, దీనిపై అన్ని సంఘాలూ, తల్లిదండ్రులు, ప్రజానీకం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.బేబీరాణి మాట్లాడుతూ ప్రజలకు వాస్తవంగా సేవ చేసే అంగన్‌వాడీ, ఆశా మధ్యాహ్నం భోజనం వంటి స్కీం ఉద్యోగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాలు పెంచకుండా గౌరవ వేతనం పేరుతో రోజురోజుకూ పని భారం పెంచుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో చాలీచాలని జీతాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలు ఏమీ అమలు కాకుండా చేస్తున్నారని, ఎన్నికల ముందు స్కీమ్ ఉద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదని తెలిపారు. ఆశా వర్కర్లకు కనీసం ప్రసూతి సెలవులు కూడా లేకుండా ప్రభుత్వం పని చేయించుకోవడం దారుణమన్నారు. స్కీం ఉద్యోగుల సమస్యలపై సిఐటియు చేస్తున్న పోరాటానికి జిల్లాలోని ఆశా వర్కర్లు మరింత పట్టుదలగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, యూనియన్ జిల్లా కార్యదర్శి డి.జ్యోతి మాట్లాడుతూ ఆగస్టులో జిల్లా మహాసభలు, సెప్టెంబర్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోపు అన్ని మండలాల మహాసభలను పూర్తిచేయాలని వివరించారు. యూనియన్ నాయకులు లారెన్స్ కుమారి, బేగం, జయంతి, ఆదిలక్ష్మి, పరమేశ్వరి, రమాదేవి, వరలక్ష్మి, రూప, అమ్మాజీ, పాల్గొన్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - యలమంచిలి

కౌలు రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని చించినాడ గ్రామంలోని అమరవీరుల స్మారక భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం టి.నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బలరాంతోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారని, ఐతే వారికి గుర్తింపు కార్డులు లేకపోవడంతో పంట నష్టపరిహారం, రుణాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన ప్రకారం కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించి ఆదుకోవాలని, అదేవిధంగా సార్వాకి సంబంధించి రైతులు ఇప్పటికే సన్నద్ధం అవుతున్న తరుణంలో వారికి విత్తనాలు, నారుమడులు, నాట్లకు సంబంధించి పెట్టుబడులకు సొమ్ములు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న ధాన్యం బకాయిలు వెంటనే అందించే విధంగా సివిల్ సప్లై వారు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తుందని, అనేక నెలలుగా ఉపాధిహామీ చట్టంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం దారుణమని, ఇప్పటికైనా కార్మికులందరికీ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేతా సూర్యరావు, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం జిల్లా నాయకులు కారుమంచి క్రాంతి బాబు, బాతిరెడ్డి జార్జి, నాయకులు గూడూరి ఆంజనేయులు, చెల్లుబోయిన వడ్డి కాసులు, ఎడ్ల మోహన్ రావు, ఏసేపు, గూడూరి నాగేశ్వరరావు, జిల్లెల్ల ప్రశాంతి, బాతిరెడ్డి సుగుణ, శ్రీరాములు పాల్గొన్నారు.

కలవపూడి సొసైటీ ఛైర్మన్‌గా మంతెన చిన నరసింహరాజు



కాళ్ల : కలవపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం(పిఎసిఎస్) త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా మంతెన చిన నరసింహరాజు నియమితులయ్యారు. కలవపూడి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు మంతెన చిననరసింహరాజు ఛైర్మన్‌గా, పెన్మెత్స జానకీ రామరాజు, వాతాడి రామారావు సభ్యులుగా ఎంపికైనట్లు ఉత్తర్వులు జారీ చేశారు. మంతెన చిన నరసింహరాజు తండ్రి సూర్యనారాయణరాజు గతంలో సొసైటీ ఛైర్మన్‌గా పనిచేశారు. అనంతరం ఆయన సోదరుడు మంతెన బలరామరాజు ఒక పర్యాయం, అదే కుటుంబానికి చెందిన మాజీ ఎంఎల్ఎ, ప్రస్తుత ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు రెండు పర్యాయాలు బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం మంతెన చిన నరసింహరాజు ఛైర్మన్‌గా ఎంపిక కావడం పట్ల కలవపూడి టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు

సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని పిలుపు ఇచ్చిన మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం విమర్శించారు. స్థానిక మెంటేవారితోటలో భీమవరం విస్తృత సమావేశం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అదానీ కంపెనీతో చేసుకున్న ఒప్పందంపై సమీక్షిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అవే విధానాలు అమలు చేయడాన్ని ఖండించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అదానితో సెకి ఒప్పందం చేసుకోవడం ద్వారా ప్రజలపై లక్ష కోట్ల భారం పడిందన్న కూటమి ప్రభుత్వం అవే విధానాలు అమలు సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల జేబులు ఖాళీ చేయడం ఖాయమని, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రత్యేక హోదా అడగడానికి కూటమి ప్రభుత్వానికి నోరు రావడం లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు పొంతనలేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు, విద్యుత్ బిలలకు లింక్ పెట్టి కోతలు విధిస్తున్నారని, ఎటువంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు పాడుబడిపోయిన బంగళాల్లా ఉన్నాయని, వెంటనే మౌలిక వసతులు పూర్తిచేసి లబ్ధిదారులకు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. వేళాపాలాలేని కరెంటు కోతలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు బి.సత్యనారాయణ, సిహెచ్.వెంకటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, పట్నాల రేణుక, మోటిపల్లి మంగ, ఆర్.మణి, అప్పన్న, బంగారు వరలక్ష్మి, జి.జనార్దన్‌రావు, నీలాపు రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు సీతారాం

భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన అసోసియేషన్ సభ్యులు

భీమవరం : స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో ది భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చవాకుల నరసింహారావు, ఉపాధ్యక్షులుగా చక్కా వెంకట సుబ్బారావు, కొత్త వెంకట శ్రీరామనారాయణ(శ్రీనివాస్), రావూరి వెంకటేశ్వరరావు, పరుచూరి వెంకట చిననాగేశ్వరరావు, కార్యదర్శిగా ఇన్నమూరి నాగేశ్వరరావు, సహాయకార్యదర్శి అల్లం వెంకట నాగరమేష్, ఇన్నమూరి వెంకటేశ్వర్లు(చలపతి), మెంటే హనుమ నాగకృష్ణ, చవ్వా భామాకృష్ణమూర్తి, కోశాధికారి బాదరాల వుల్లేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సభ్యులు ఘనంగా సత్కరించారు.

విద్యాశాఖ మొద్దు నిద్ర వీడాలి

సెలవు దినాల్లోనూ యధావిధిగా ప్రయివేటు విద్యాసంస్థలు

చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ



తాడేపల్లిగూడెంలో కళాశాల ఎదుట బైఠాయించిన ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రెండవ శనివారం ప్రభుత్వం సెలవు దినం ప్రకటించిన రోజున విద్యార్థులను పాఠశాలకు రప్పించి పాఠశాలను యధావిధిగా నిర్వహించడాన్ని ఎస్ఎఫ్ఐ తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ అడ్డుకుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పతివాడ నాగేంద్రబాబు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న సెంట్‌ఆన్స్ విద్యాసంస్థలు ఏవిధమైన ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పాఠశాలను యధావిధిగా నిర్వహించడాన్ని చూసి ఆయన మండిపడ్డారు. ఈ విషయం గురించి సెంట్‌ఆన్స్ విద్యాసంస్థల యాజమాన్యాన్ని ప్రశ్నించగా వారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెప్పిన సమాధానంపై మండిపడ్డారు. ఈ విషయమై స్థానిక విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం సెలవు ప్రకటించిన దినాలలో స్కూలు తెరవడాన్ని స్థానిక విద్యాశాఖ అధికారులకు తెలిసే జరుగుతుందని అన్నారు. ఇటువంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనియెడల స్థానిక విద్యాశాఖ అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకురాలు బి.సింధు, పట్టణ కమిటీ అధ్యక్షుడు రవి, నాయకులు కేశవ, గణేష్, భాను, సుజాత, ధనుష్, మణికంఠ పాల్గొన్నారు.

ఉండి : మండలంలో ఉన్న గీతాంజలి స్కూల్ యాజమాన్యం రెండవ శనివారం సెలవు దినమైన ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తుందని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కె.గోవింద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించిన సరే కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలి విద్యాసంస్థలు నడుపుతున్నా.. మండల విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. ఈ సమాచారాన్ని విద్యాశాఖ అధికారులకు తెలియజేద్దామని ప్రయత్నించినా ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని ఉన్నారని, ఇది అంతా మండల విద్యాశాఖ అధికారులు కనుసన్నలోనే జరుగుతుందన్నారు. అధికారులు మొద్దు నిద్రవీడి విద్యావ్యవస్థ నిబంధనలను కాపాడాలని, లేనిపక్షంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ అధికారులపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రోహిత్, మండల ఉపాధ్యక్షులు సాయి పాల్గొన్నారు.


నరసాపురం: ఆదిత్య కళాశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. నరసాపురం పట్టణంలో ఉన్న ఆదిత్య జూనియర్ కాలేజీలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవు దినాలలో విద్యార్థులను బెదిరించి కళాశాలకు హాజరుకమ్మని చెప్పి అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నరసాపురం పట్టణ కమిటీ అక్కడికి చేరుకుని వెంటనే ఆదిత్య కళాశాల యాజమాన్యంతో మాట్లాడి, కళాశాలలో అక్కడ ఉన్న విద్యార్థులతో మాట్లాడి విద్యార్థులందరినీ వారి ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడారు. పట్టణ నాయకులు ధీరజ్, చందు, ధనుంజయ్ పాల్గొన్నారు.



ఉండిలో..

సమ్మేళనం ఆర్భాటం.. సమస్యలు అపరిష్కృతం

విద్యార్థుల ప్రగతి వివరించేందుకు, విద్యాప్రమాణాలు పెంచేందుకు నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనాలు అద్భుతంగా ప్రచార ఆర్భాటంగా సాగాయి. అయితే విద్యాప్రమాణాల మెరుగుకు కీలకమైన సమస్యల పరిష్కారంపై చర్చకు అవకాశం ఇవ్వకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. పోలవరం నిర్వాసితుల కష్టాలు, వరద గోదావరి ఉగ్ర రూపంతో మరోసారి తెరపైకి వచ్చాయి.



మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమ్మేళనాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కృషి ఫలితంగా విజయవంతంగా సాగాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు కూటమి నేతలు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో పాఠశాలన్నింట్లో సందడి నెలకొంది. అయితే ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు తమ ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ఏకరువు పెట్టారు. తమ ప్రభుత్వం తల్లికివందనం, నిధులు ఇచ్చిందని, రాజకీయ ప్రచారానికి సైతం తెర లేపారు. అయితే ఆయా పాఠశాలల పరిధిలో ఉన్న సమస్యల గురించి కనీస ప్రస్తావన గాని, చర్యలు గాని చెప్పకపోవడం గమనార్హం. చాలా పాఠశాలల్లో కొన్ని ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడం, భవనాల సమస్య, ఆటస్థలాల కొరత వంటి సమస్యలు చాలా కాలంగా ఉన్నాయి. వీటి పరిష్కారానికి ఏం చేయదలుచుకున్నారో కూడా కనీస హామీలు ఇవ్వని పరిస్థితి. విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడుల్లో ఉపాధ్యాయ పోస్టులు పెద్దసంఖ్యలో ఖాళీ ఉన్నాయి. దీనిపై ఇప్పటికే ఆ ప్రాంత విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రధానంగా సమస్యలు ఎక్కువగా ఉన్న పాఠశాల వైపు ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అదే సమయంలో కొన్నిచోట్ల ప్రయివేట్ పాఠశాలల్లో కార్యక్రమాలకు హాజరైన ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలకు సాయంత్రం సమయాల్లో వెళ్లడం పలు విమర్శలకు కారణమైంది. ఇదేనా ప్రభుత్వ పాఠశాలలపై ఉన్న ప్రేమ అని పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.

జులై రెండో వారంలోనే వరద గోదావరి ఉరకలు వేస్తుంది. ఈ క్రమంలో విలీన మండలమైన వేలేరు పాడులోని ముంపు బాధితుల కష్టాలు మరోసారి తెరపైకి వచ్చాయి. నిర్వాసితులు తమకు పరిహారం ప్యాకేజీ చెల్లించి పునరావాస గ్రామాలకు తరలించాలని చాలాకాలంగా కోరుతున్నారు. వరదలు వచ్చినప్పుడు అధికారులు, నేతలు, ప్రజాప్రతినిధులు హామీలు ఇవ్వడం తప్ప కార్యాచరణకు చర్యలు లేకపోవడంతో ప్రతి ఏటా మూడు నెలల పాటు ముంపు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సివస్తోంది. ఇప్పటికైనా ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలు, హామీలు మాని చట్ట ప్రకారం నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం ప్యాకేజీ ఇవ్వడంతో పాటు పునరావాస గ్రామాల నిర్మాణం పూర్తి చేసి తమకు తరలించాల్సిందిగా కోరుతున్నారు. లేకపక్షంలో ప్రతి ఏటా నిర్వాసితులకు ఈ దుస్థితి తప్పని పరిస్థితి కనిపిస్తుంది.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

ఆరోగ్యవంతంగా జీవించండి

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నాటుసారాయి, మద్యపాన సేవనం వ్యసనంలో చిక్కుకొని అనారోగ్యంబారిన పడినవారిని ప్రభుత్వ వ్యసన విముక్తి కేంద్రంలో చేర్పించాలని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. మద్యపాన సేవనం, మత్తు పదార్థాల వినియోగం అనే వ్యసనాల పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఆమె శనివారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాటు సారాయి నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0 భాగంగా శనివారం స్థానిక కేంద్ర ప్రభుత్వ గిడ్డంగుల సంస్థ కార్మికులకు మద్యపాన వ్యసనం-వ్యసన విముక్తి కేర్ కమిటీ ద్వారా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సారాయి, మద్యపాన సేవనం వ్యసనంలో చిక్కుకుని అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న వ్యసన విముక్త కేంద్రంలో చేర్పించుటకు గల అవకాశాలను వారికి వివరించారు. మద్యపాన వ్యసనానికి దూరంగా ఉండి ప్రతిఒక్కరూ ఆరోగ్యవంతంగా జీవించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యలక్ష్మి ఆకాంక్షించారు. అనంతరం కార్మికులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ జి.మురళీ మోహన్‌రావు, ఆర్.దొరబాబు, హెడ్ కానిస్టేబుల్ విష్ణువ కుమార్, అనిల్ కుమార్, సిబ్బంది, గిడ్డంగి కార్మికులు పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలిఅడుగు

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం తణుకు పట్టణంలోని 27, 28 వార్డుల్లో ఇంటింటికి పర్యటించిన ఎంఎల్ఎ గత ఏడాదికాలంగా అందుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ పారదర్శకంగా ప్రజలకు జవాబుదారితనంగా పాలన అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని టిడిపి మొగల్తూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సేరేపాలెం, కొత్తపాలెం గ్రామాలలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో దుసనపూడి రమేష్, పులపర్తి త్రిమూర్తులు, లోకం శ్రీనివాస్, నాగిడి రాంబాబు, దుసనపూడి సత్యనారాయణ, తణుకుల మునీశ్వరరావు, పాల రాంబాబు, పులపర్తి శ్రీను, చెన్ను బాలాజీ, నాయకులు ఉన్నారు.

పెనుమంట్ర : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పరవళ్లు తొక్కుతున్నాయని టిడిపి తెలుగు యువత నాయకులు, ఎంఎల్ఎ తనయుడు పితాని వెంకట్ సురేష్ అన్నారు. శనివారం మండలంలోని మార్టేరు, నెగ్గిపూడి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వెంకట్ సురేష్ పర్యటించారు. టిడిపి ఆచంట నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, టిడిపి మండల అధ్యక్షులు వెలగల బులి రామిరెడ్డి, తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం వితరణ

ప్రజాశక్తి - గణపవరం

పేదల ఆకలి తీర్చడానికి లయన్స్ సభ్యులు తమవంతు కృషి చేస్తున్నట్లు గణపవరం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు అన్నారు. శనివారం స్థానిక వెంకటేశ్వర ఆలయం వద్ద 30 మంది పేద కుటుంబాలకు అల్పాహారం పొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, కెఎస్.రాధాకృష్ణ, ఎన్.శ్రీహరి, కృష్ణాజీ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - ఆకివీడు

దాతల సహకారంతో అందిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్, అంతర్జాతీయ సభ్యులు డాక్టర్ ఎవి.సూర్యనారాయణ రాజు అన్నారు. శనివారం స్థానిక అభయ లయన్స్ క్లబ్, పాలకొల్లు ఆర్ఆర్ లయన్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బుదరాజు మార్కెట్ దగ్గర కల్యాణ రామాలయంలో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎవి.సూర్యనారాయణ రాజు ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు జరిపారు. 58 మందికి కంటి ఆపరేషన్లు, 91 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. ఈనెల 26న ఉచితంగా దాతల సహకారంతో కళ్లజోళ్లు అందిస్తామన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని ఆర్ఆర్ లయన్స్ ఆసుపత్రిలో తమ వాహనంలో తీసుకు వెళ్లి ఆపరేషన్ చేయిస్తామని చెప్పారు. ఈ శిబిరంలో అభయ లయన్స్ క్లబ్ అధ్యక్షులు గమిడి వీరకుమార్, కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ(డ్రుడు), జెడ్‌సి పెన్నీ సుబ్రహ్మణ్యం, భాష్యం సత్యనారాయణ, కందుల అప్పారావు, కకార చిదంబరం, రామాలయం కమిటీ ఛైర్మన్ రాంబాబు, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణే లక్ష్యం

జిల్లా అదనపు ఎస్‌పి వి.భీమారావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రైళ్లలో గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో రాష్ట్ర అధికారుల ఉత్తర్వుల మేరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు తెలిపారు. భీమవరం టూ టౌన్ పోలీసులు, ఈగల్ టీమ్స్, రైల్వే పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలు సంయుక్తంగా శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా అడిషనల్ ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి ప్రధానంగా ఒడిస్సా రాష్ట్రం నుంచి ట్రెయిన్స్ ద్వారా ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అవుతుందన్న పోలీసు నిఘా వర్గాల సమాచారంతో ప్రత్యేకంగా విశాఖ ఎక్స్‌ప్రెస్(ట్రైన్ నెం.17015)లో పోలీసులు విస్తృతమైన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్‌లోని అన్ని బోగీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, బ్యాగులను, లగేజ్, సూట్కేసులను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. తనిఖీలో ఎటువంటి గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలు లభించలేదన్నారు. రాష్ట్రంలో గంజాయిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రత్యేకంగా ఈగల్ టీమ్‌ను నియమించిందన్నారు. ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజున వివిధ ట్రెయిన్లలో తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని భీమవరం ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో భీమవరం టూ టౌన్ సిఐ జి.కాళీ చరణ్, సిబ్బంది, ఈగల్ టీమ్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సత్కారం

మొగల్తూరు : కొత్తకాయల గ్రామ సచివాలయ సిబ్బంది ఎనలేని సేవలు అందించారని జనసేన నాయకులు సత్తినేని శ్రీనివాస్ తాతాజీ అన్నారు. మండలంలోని కొత్త గ్రామంలోని సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు సచివాలయ ఉద్యోగులను శ్రీనివాస్ తాతాజీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యదర్శి బందన నరిని ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తిరుమని ముత్యాలరాజు, ఎఎన్ఎం రేపాక పద్మావతి దేవి, ఫిషరీస్ అసిస్టెంట్ పాము స్వాతి, మహిళా పోలీస్ యు.దేవి బదిలీ అయ్యారు. వారిని ఘనంగా సత్కరించారు. తాతాజీ ఏర్పాటు చేసిన విందు కోసం ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, అగ్రికల్చర్ ఏ.ఇ మోహన్‌రావు, సర్పంచ్ పడవల సత్యనారాయణ, ఎంపిటిసి లింగం ఏసుబాబు, గ్రామ త్రిమ ఉన్నారు.

బంగారం, డబ్బు రికవరీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి వద్ద నుంచి రెండు కాసుల బంగారం, రూ.లక్షలల్లో వేలు రికవరీ చేసినట్లు పట్టణ సిఐ బి.ఆదిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి, తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ ఆదేశాల ప్రకారం రాత్రిపూట చోరీలు నివారించేందుకు ప్రత్యేక క్రైమ్ సిబ్బందిని ఏర్పాటు చేశామని సిఐ తెలిపారు. దీనిలో భాగంగా స్థానిక 26వ వార్డులో ఈనెల 1వ తేదీన గుండు వారి వీధిలో చోరీ జరిగింది. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా నేరాన్ని గుర్తించి హరీష్ అనే వ్యక్తిని విచారించగా, తన వద్ద నుంచి లక్ష నగదు వేలు, 2 కాసుల బంగారం రికవరీ చేశామని వివరించారు. హరీష్ గతంలో వివిధ జిల్లాలలో 15 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసు రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులను ఎస్‌పి, డిఎస్‌పి అభినందించారు.

ఆకివీడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కాళ్ల



ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ డైరెక్టర్‌గా సీసలి గ్రామానికి చెందిన వాస్కూరి శ్రీనివాసరావు నియమితులయ్యారు. సీసలి టిడిపి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు మార్కెట్ యార్డు నూతన పాలకవర్గ కమిటీలో చోటు లభించింది. గత కొన్నేళ్లుగా టిడిపిలో క్రియాశీల నేతగా ఉంటూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తనకు మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలుపుతూ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి ఇచ్చినందుకు బాధ్యతాయుతమైన సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు. టిడిపి నాయకుడికి గుర్తింపునిచ్చి డైరెక్టర్‌గా స్థానం కల్పించడం పట్ల పలువురు టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా కొట్టు ఇందిరా



కాళ్ల : ఆకివీడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా కొట్టు ఇందిరా నియమితులయ్యారు. ఏలూరుపాడు గ్రామానికి చెందిన కొట్టు ఇందిరా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి మహిళా శక్తి విభాగంలో టీమ్ సభ్యురాలుగా ఉండి ఎన్నికల ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేట్ ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇందిరాకు పదవి దక్కడంపై ఆమె ఆనందం వ్యక్తం చేసింది. ఈ అవకాశం ఇచ్చిన డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పూర్తిస్థాయిలో సాగునీరందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ఆచంట : ఒక పక్క వర్షాలు రాక మరోవైపు సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శనివారం సాయంత్రం సిపిఎం మండల కమిటీ సమావేశం మండల కమిటీ సభ్యులు కుసుమే జయరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గోపాలన్ పాల్గొని మాట్లాడుతూ కోడేరు బ్యాంకు కెనాల్ నుంచి సాగునీరు సరిగా అందడం లేదని, రైతులు వేసిన నారుమళ్లకు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక పక్క గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్న, పంట బోదులలో ఆయిల్ ఇంజన్లు వేసి రైతులు నీరు తోడుకోవలసిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. కాలువల్లో నీటిమట్టాలు పడిపోవడంతో నాట్లు వేసేందుకు అణువుగా దమ్ములు చేసే పరిస్థితి లేదని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు, మండల కమిటీ సభ్యులు తలుపురి బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, గుత్తుల రంగారావు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన తప్పనిసరి

తాడేపల్లిగూడెం : రైతులు ఎరువుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలని నత్రజని(యూరియా) వాడకాన్ని తగ్గించుకోవాలని తాడేపల్లిగూడెం మండల వ్యవసాయాధికారి నారాయణరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా స్వర్ణ రకం(ఎంటియు 7029) సాగు అవుతున్నందున నాట్లు వేసేముందు తప్పని సరిగా ఎకరానికి 20 కేజీల ఎంఒపి వాడాలన్నారు. ఈ పోటాష్ పోషకం ద్వారా మొక్కను మొదటి నుంచి ఎదుగుదలతో రోగనిరోధక శక్తి వచ్చునని, దీనివల్ల చీడపీడ ప్రభావం పంటపై తగ్గుతుందన్నారు. మండలంలో నాలుగు సొసైటీల ద్వారా 355 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, ఇతర కాంప్లెక్స్ ఎరువులు కూడా పూర్తి స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా సార్వాలో పంటకు రుణం పొందిన రైతులు సంబంధిత బ్యాంకులు, సొసైటీల ద్వారా బీమా చేయించుకోవాలని, ఋణం పొందని రైతులు గ్రామంలో రైతుసేవా కేంద్రం ద్వారా ఎకరానికి రూ.210 చొప్పున ప్రీమియం చెల్లించి పంటను బీమా చేయించుకోవలసిందిగా ఆయన తెలియజేశారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి : డిఎస్‌పి



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి

నరసాపురం : నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. హైవే రహదారి వెంబడి ఎలాంటి అక్రమ రవాణాకు తావు లేకుండా నిరంతరం నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేసి అడ్డువేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గ్యాంబ్లింగ్, గుట్కా అమ్మకాలు వంటి వాటి వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గ్రామస్థాయిలో సభలు ఏర్పాటు చేసి తగాదాలు లేకుండా అరికట్టాలని, సైబర్ నేరాలు, ఫేక్ లోన్ యాప్‌ల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల సంబంధించిన ఫిర్యాదులకు పోలీస్ స్టేషన్ అండగా ఉండి సత్వరం పరిష్కరించాలని ఆయన సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు, కేసుల డైరీ, కోర్టు క్యాలెండర్, స్టేషన్ పరిసరాలు, సీజ్ చేసిన వాహనాలు, పలు కేసులో రికార్డులు తనిఖీ చేసి, మహిళలకు సంబంధించిన నేరాల పట్ల వెంటనే స్పందించి బాధితులకి సరైన న్యాయం చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న కేసులు సకాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పూర్తిచేయాలని సూచించారు. డిఎస్‌పి వెంట నరసాపురం రూరల్ సిఐ జి.దుర్గా ప్రసాద్, ఎస్ఐ టి.వెంకట సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

గణపవరం : డేంగీ మాసోత్సవాల సందర్భంగా శనివారం గణపవరం పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో డేంగీ నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ మలేరియా అధికారి ఎస్.ప్రసాద్, డాక్టర్ కె.ఓంకార్ నాద్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు దోమల నివారణ మార్గమని అన్నారు. జూలై నెలాఖరు వరకు డెంగీ వ్యాధిపై తమ వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి స్థానికులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సిహెచ్‌ఒ.జాలాది విల్సన్ బాబు, సిహెచ్‌వి.సత్యవతి, ఎంబాల మురళీకృష్ణ, హెచ్‌వి.పద్మజ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి - తణుకు

డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్య ప్రభావాలపై కేర్ కమిటీ(కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల మానవ ఆరోగ్యంపై ముఖ్యంగా శరీరంలో వివిధ అవయవాలు గొంతు, అన్నవాహిక, కాలేయం, పెద్ద ప్రేగులు, గుండె తదితర అవయవాలపై చూపే దుష్ప్రభావాలు, మానసిక ఆందోళన, డిప్రెషన్, అధిక రక్తపోటు తదితర లక్షణాలు కలుగుతాయని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిస అయినవారికి ఆ వ్యసనం నుంచి బయట పడుటకు, పునరావాసం కల్పించుటకు అవసరమైన కౌన్సెలింగ్, పునరావాస కేంద్రాలు జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం ప్రాంతాలలో అందుబాటులో కలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో తణుకు ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్

ప్రజాశక్తి - ఆచంట

దేశంలో పేదరిక నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. నన్నేటి ఆనందం ఐదవ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లో నిరుపేదలకు బిర్యానీ పొట్లాలు పుష్పరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టి స్వయంగా వారికే చేరేటట్లు ప్రయత్నాలు చేస్తే దేశంలో గాని, రాష్ట్రంలో గాని పేదలను నిర్మూలించవచ్చునని, దేశంలో ఆస్తులను సమానంగా పంచాలని అప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి నిర్వహణ కోసం వెచ్చించే నిధులు స్వయంగా పేదలకే చెందేటట్లు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జోసెఫ్, సోనీ శ్యాస్, అమల, చిల్లి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వంతెనపై శాశ్వత ఇనుప చట్రాలు!

ప్రజాశక్తి - పాలకొల్లు



శాశ్వతమైన ఎర్రవంతెన వద్ద తాత్కాలికంగా పెట్టిన సపోర్ట్

పాలకొల్లు పట్టణ నడిబొడ్డున మార్టేరు రోడ్‌లోని ఎర్రవంతెన 1986లో వచ్చిన వరదలు, 1991లో వచ్చిన తుఫాన్‌కు పాడైపోయింది. ఈ వంతెన బ్రిటిష్ హయాంలో నిర్మించారు. ఈ వంతెనపై పలు గ్రామాల ప్రజలు, పట్టణ వాసులు ప్రయాణించేవారు. అయితే ప్రయాణికుల సౌకర్యం కొరకు ఒఎన్‌జిసి తాత్కాలికంగా వంతెన పడకుండా మధ్యలో ఇనుప చట్రాలు పెట్టింది. మున్సిపాలిటీ గాని ఏ ఇతర నేతలు గాని ఈ వంతెనపై శాశ్వతంగా వంతెన నిర్మాణానికి కృషి చేయలేదు. దీంతో తాత్కాలికంగా పెట్టిన ఐరన్ చట్రాలే శాశ్వతం అయ్యాయి.

ప్రత్యామ్నాయ వంతెన నిర్మాణం..

పాలకొల్లు పట్టణంలోని ఇవతల వైపు నుంచి అవతలకు వెళ్లడానికి ఎర్ర వంతెన ఫుట్‌పాత్ బ్రిడ్జి గాను, లాకుల వద్ద 4 చక్రాల వాహనాలు వెళ్లడానికి మరో వంతెన ఉండేది. అయితే ట్రాఫిక్ పెరిగాక బ్రాడీపేట వద్ద 3 చక్రాల వాహనాలు వెళ్లేందుకు మరో వంతెన, మావుళ్లమ్మ గుడి వద్ద డాక్టర్ దాసరి నారాయణరావు తన ఎంపీ నిధులు రూ.2 కోట్లతో 3 చక్రాల వాహనాలు వెళ్లేందుకు మరో వంతెన 2000లో నిర్మించారు. దీంతో ఎర్రవంతెనపై ట్రాఫిక్ తగ్గింది. ప్రస్తుతం టిడ్కోగృహాల వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు రూ.2 కోట్లతో మరో ఫుట్ పాత్ వంతెన నిర్మిస్తున్నారు. బ్రాడీపేట-జిన్నూరుల మధ్య కూడా మరో వంతెన అవసరం ఉంది. దీనిని భారతీయ విద్యాభవన్ స్కూల్ వద్ద నిర్మిస్తే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలు గ్రామస్తులకు ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలకు ధీటుగా గూడెం అభివృద్ధి

గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్‌రాజు

తాడేపల్లిగూడెం : అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్న రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆదర్శప్రాయులని గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకట్‌రాజు అన్నారు. శనివారం ఆయన తాడేపల్లిగూడెం పట్టణం 32వ వార్డ్ కడకట్లలో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, దాతల సహకారంతో నిర్మిస్తున్న జెడ్‌పి హైస్కూల్ ఓపెన్ ఆడిటోరియం, జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో వాకింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం పనులను ఎంఎల్ఎ మద్దిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాలతో, ఆధునిక పద్ధతులతో జాతీయ స్థాయిలో క్రీడాభివృద్ధికి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్న తీరును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మారుతున్న జీవనశైలిలో ప్రతి మనిషికి శారీరక శ్రమ అవసరమని తద్వారా మానసిక ప్రశాంతత, వ్యాధినిరోధక శక్తిని పెంపొందించుకుని మానవ శరీరాన్ని ధృఢంగా చేసుకోవచ్చుని అన్న కృతనిశ్చయంతో బొలిశెట్టి చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ప్రస్తుత యాంత్రిక ప్రపంచంలో శారీరక క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు. దానికి తగినట్టుగా నియోజకవర్గంలో స్విమ్మింగ్ పూల్, క్రికెట్ స్టేడియం వంటి క్రీడాభివృద్ధిని చేస్తున్నారన్నారు. గ్రామీణ నేపథ్యం నిండుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలలో ఇటువంటి క్రీడాభివృద్ధి పట్ల స్థానిక ఎంఎల్ఎ చూపుతున్న చొరవ ప్రతి ఒక్కరికి ఆదర్శం అన్నారు. గతంలో మున్సిపల్ ఛైర్మన్‌గా చేసిన అనుభవాలను ఎంఎల్ఎ బొలిశెట్టి రంగరించి ఈ ప్రాంతంపై ఉన్న అభిమానంతో అనేక అభివృద్ధి పనులను చేస్తున్నారన్నారు. ఈ అభివృద్ధి పనులను చూసి తాను స్ఫూర్తి పొందుతున్నానని, తమ నియోజకవర్గంలో కూడా ఈ విధమైన అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన చేసే విధంగా స్ఫూర్తి కల్పిస్తున్నారని అన్నారు.

అదనపు కోర్టు మంజూరుకు కృషి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా జడ్జి సికిందర్ భాషా, సీనియర్ న్యాయవాదులు

తాడేపల్లిగూడెం పరిధిలో కోర్టు కేసులు వేల సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని, కేసుల సత్వర పరిష్కారానికి అదనపు సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టు మంజూరుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్ రెడ్డి హామీ ఇచ్చారని 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, కోశాధికారి ఈదా ఫరోత్బాబు, న్యాయవాదులు యడవల్లి మణికంఠ తేజ, శనివారపు వెంకట రామకృష్ణ హైకోర్టు న్యాయమూర్తిని కలిసి తాడేపల్లిగూడెం కోర్టు పరిధిలోని పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. ఈ సందర్భంగా జస్టిస్ కె.సురేష్ రెడ్డి స్పందిస్తూ అదనపు కోర్టు కోసం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ఎస్.శ్రీదేవి ద్వారా ప్రతిపాదనలు పంపాలని, మంజూరుకు కృషిచేస్తానని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

రేపు 'కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి'

ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మునిస్వామి

భీమవరం : గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 14వ తేదీన కలెక్టర్‌కి చెప్పుకుందాం రండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 171 సహకార సంఘాల ద్వారా 9 కుటుంబాలకు చెందిన సుమారు 15 వేల గీత కార్మికులు వృత్తి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోనే ఆర్థిక రాజకీయ చరిత్రలో కల్లుగీత వృత్తికి ఒక విశిష్ట స్థానం ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వాలు మారుతున్న కొద్దీ గీత వృత్తిని నిర్వీర్యం చేసేలా, గీతన్నల ఉపాధిని దెబ్బతీసేలా విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లు అమ్మకాలు లేకుండా చేసి సంక్షోభంలో పడవేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో సుమారు నాలుగువేలకుపైగా బెల్ట్ షాపులు పెట్టిన ఘనత టిడిపి ప్రభుత్వానిదే అన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా నాయకత్వం, కార్మికులు హాజరవుతున్నట్లు తెలిపారు.

వాన్‌బర్రీ ఫార్మా పరిశ్రమ పరిశీలన

తణుకు : వాన్‌బర్రీ ఫార్మా పరిశ్రమ రాష్ట్ర, జిల్లా అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని వాన్‌బర్రీ ఫార్మా పరిశ్రమలోని విభాగాలను, ప్రదేశాలను సందర్శించి పరిశీలించారు. ప్లాంట్ హెడ్ ముత్యాల వివిఎస్ఎన్ మూర్తిని వివరాలు అడిగి తెలుసుకుని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, శ్రీను(సెఫ్టీ), శేఖర్‌రెడ్డి(ప్రొడక్షన్స్), టివి.రావు(హెచ్‌ఆర్), ఎన్ఎన్.రావు(డబ్ల్యుహెచ్), పి.రాంబాబు(ఇఎస్‌డి) పాల్గొన్నారు.